సాక్షి
మెదక్
శనివారం । 11 । మే । 2024

న్యూస్‌రీల్

అభ్యుదయ వాది బసవేశ్వరుడు



బసవేశ్వరుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, అధికారులు

మెదక్ కలెక్టరేట్: సమాజంలో కుల వ్యవస్థ, వర్ణ భేదాలను, లింగ వివక్షతను సమూలంగా వ్యతిరేకించిన అభ్యుదయ వాది బసవేశ్వరుడని కలెక్టర్ రాహుల్‌రాజ్ కొనియాడారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బసవేశ్వర జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అందరం సమానమేనని సుమారు 800 సంవత్సరాల క్రితమే బసవేశ్వరుడు చాటి చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వెనుక బడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి నాగరాజ్ గౌడ్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ పార్లమెంట్ ఎన్నికలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారులతో కలిసి పాల్గొన్నారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

పోలింగ్ సామగ్రి పరిశీలన

మెదక్‌జోన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో భద్రపరిచిన పోలింగ్ సామగ్రి కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్‌రాజ్ శుక్రవారం పరిశీలించారు. సామగ్రిని సరిచూసుకొని పంపిణీ చేయాలని అధికారును ఆదేశించారు. వీటిని పోలింగ్‌కు ఒకరోజు ముందు ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించాలన్నారు.

నేడు పటాన్‌చెరుకు సీఎం రేవంత్



కార్నర్ మీటింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కాట శ్రీనివాస్ గౌడ్

పటాన్‌చెరు టౌన్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం పటాన్‌చెరులో పర్యటించనున్నారు. మెదక్ లోక్‌సభ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లో పాల్గొని ప్రసంగించనున్నారు. శుక్రవారం ఉదయం అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్నర్ మీటింగ్ జరిగే ప్రాంతాన్ని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెదక్ లోక్‌సభ స్థానం నుంచి నీలం మధు గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సీఎం ప్రచార కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

క్రీడా కోర్సుల్లో ప్రవేశాలు

మెదక్ కలెక్టరేట్: కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పలు క్రీడల్లో నైపుణ్యం కల్పించేందుకు కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్(ఎల్‌ఎన్‌ఐపీఈ)లో 2024- 25లో రెగ్యులర్ ప్రాతిపదికన ప్రవేశాలకు జూన్, జులైలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సందేహాలకు 0751-4000887 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎన్నికల వేళ అదనపు బస్సులు

నారాయణఖేడ్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పటాన్‌చెరు, హైదరాబాద్‌లతో పాటు పరిసర ప్రాంతాలకు వలస వెళ్లినవారు ఇతర ప్రాంతాల్లో ఉంటే వారు సొంతూరుకి వచ్చి ఓటు హక్కు వినియోగించుకునేలా ఖేడ్ నుంచి పటాన్‌చెరు, లింగంపల్లి, సికింద్రాబాద్‌లకు ఇదివరకు నడుస్తున్న బస్సులతోపాటు అదనంగా 20 బస్సులను నడుపుతున్నట్లు చెప్పారు. ఎండలు మండుతున్నందున మార్గమధ్యలో ఉన్న ప్రతీ బస్టాండ్ లో తాగునీటి సదుపాయాలు కల్పించామన్నారు. ప్రత్యేక బస్సులు శుక్రవారం నుంచి 13వ తేదీ వరకు నడుస్తామని వివరించారు.

దరఖాస్తుల స్వీకరణ

మిరుదొడ్డి(దుబ్బాక): ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను సీకరిస్తున్నట్లు తెలంగాణ మోడల్ స్కూల్/కళాశాల ప్రిన్సిపాల్ భారతీ దేవి తెలిపారు.



బహూకరించిన గొంగళితో కేసీఆర్. చిత్రంలో హరీశ్‌రావు, అభ్యర్థి వెంకట్రామిరెడ్డి



సభకు హాజరైన జనం

జనం హోరు.. గులాబీ జోరు

కేసీఆర్ రాకతో పురిటిగడ్డ పులకింత

- అడుగడుగునా బీఆర్‌ఎస్ అధినేతకు స్వాగతం
- దారిపొడవునా నీరాజనాలు
- గులాబీమయమైన సిద్దిపేట

సిద్దిపేటజోన్/సిద్దిపేటకమాన్: తెలంగాణ ఉద్యమ సారథి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ రాకతో సిద్దిపేట పురిటి గడ్డ పులకించింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్ర ముగింపు సభ శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలో అట్టహాసంగా కొనసాగింది. సిరిసిల్ల పర్యటన ముగించుకుని రాత్రి 8.30 గంటల ప్రాంతంలో ముస్తాబాద్ చౌరస్తా నుంచి రోడ్డు షో ప్రారంభమైంది. దారి పొడవునా రోడ్డుకు ఇరువైపులా పార్టీ శ్రేణులు, ప్రజలు బారులు తీరి కేసీఆర్ బస్సు యాత్రకు స్వాగతం పలికారు. బస్సులో నుంచి ఇరు వైపులా ప్రజలకు చేతులు జోడించి నమస్కరిస్తూ విక్టరీ సంకేతాన్ని చూపుతూ ముందుకు సాగారు. సుమారు 45 నిమిషాల పాటు మెదక్ రోడ్డు గుండా సాగిన రోడ్డు షో బస్సు ముందు కళాకారుల నృత్యాలు, తెలంగాణ బతుకమ్మ బోనాలు, మహిళల కోలాటాలు, డప్పు చప్పులతో ఘన స్వాగతం పలికారు. ముస్తాబాద్ చౌరస్తా నుంచి కొనసాగిన బస్సు యాత్ర ఈద్గా, కాంచీట్ చౌరస్తా, విక్టరీ చౌరస్తా, ఉమా భవన్ చౌరస్తా మీదుగా పాత బస్టాండ్ వరకు చేరుకుంది. అనంతరం అంబేడ్కర్ చౌరస్తాలో కేసీఆర్ బస్సు పై నుంచి ప్రజలను ఉద్దేశించి సుమారు 11 నిమిషాల పాటు ప్రసంగించారు. ముస్తాబాద్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు కొనసాగిన బస్సు యాత్రకు పార్టీ నాయకులు, శ్రేణులు ఘన స్వాగతం పలికారు. మంగళ హారతులతో స్వాగతాలు, పూల వర్షాలతో తమ అభిమానాన్ని చాటుకున్నారు.

గుండె నిండా సంబురమని..

మిమ్మల్ని అందరినీ ఇక్కడ చూస్తుంటే కడుపు నిండా సంబురంగా ఉందని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సిద్దిపేటతో ఉన్న ఆత్మీయతను ప్రజలతో పంచుకున్నారు. కార్నర్ మీటింగ్ సందర్భంగా పాత బస్టాండ్ వద్ద ప్రజలను ఉద్దేశించి ఉద్వేగ పూరితమైన ప్రసంగం చేశారు. మాట్లాడిన పది నిమిషాల సమయం ఆద్యాంతం బీజేపీ, కాంగ్రెస్ పార్టీల వైఖరిని ఎండగట్టారు. సిద్దిపేటను హరీశ్ రావు ఎంతో అభివృద్ధి చేశారని, కొత్త జిల్లా కలెక్టర్‌గా వెంకట్రాంరెడ్డి పనితీరు బావుందని, ఎన్నికల్లో ఎంపీగా గెలిపిస్తే ఇద్దరు కలిసి సిద్దిపేటను మరింత ముందుకు తీసుకు వెళుతారని అన్నారు. కేసీఆర్ వెంట ఎమ్మెల్యే హరీశ్‌రావు, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.



బోనాలతో కోలాటం ఆడుతున్న మహిళలు



డ్రమ్స్ వాయిస్తూ.. నృత్యం చేస్తూ..



మీటింగ్‌కు హాజరైన పెద్దలింగారెడ్డిపల్లి యువత



కళాకారుల విన్యాసం



కార్యకర్త ఉత్సాహం

ప్రజలను మోసం చేస్తున్న సీఎం



కార్నర్ మీటింగ్‌కు హాజరైన జనం



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

బీజేపీ నేత ఈటల రాజేందర్

నర్సాపూర్/నర్సాపూర్ రూరల్: హామీలు అమలు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి అన్నివర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ ఆరోపించారు. శుక్రవారం రాత్రి మెదక్ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా నర్సాపూర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఇతర హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్ అహంకారంతో తనను బయటకు పంపితే ప్రజలు అయనను బయటకు పంపారని విమర్శించారు. మోదీ ప్రధానిగా రాష్ట్రానికి రెండు లక్షల 53 వేల ఇళ్లు మంజూరు చేశారన్నారు. రీజనల్ రింగ్ రోడ్డకు కేంద్రం రూ.37 వేల కోట్లు మంజూరు చేసిందని గుర్తు చేశారు. సీఎం రేవంత్ తన హామీలు అమలు చేయకుండా ప్రజలకు గాడిద గుడ్డు ఇచ్చారని ఆరోపించారు. కాగా పట్టణంలోని ఆర్టీసీ డిపో ఏరియా నుంచి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్, జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, ఓబీసీ రాష్ట్ర నాయకులు పెద్దరమేష్‌గౌడ్, చిన్న రమేష్‌గౌడ్, నాయకులు రాజేందర్, సురేష్, రమణరావు, బుచ్చేష్ యాదవ్, ఆంజనేయులుగౌడ్, యాదగిరి, రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధైర్య పడొద్దు..

తడిసిన ధాన్యం కొంటాం

- ఇప్పటికే 50 శాతం కొనుగోళ్లు పూర్తి
- 'సాక్షి'తో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



మెదక్ కలెక్టరేట్: అకాల వర్షంతో ధాన్యం తడిసిందని రైతులు అధైర్య పడొద్దని, ప్రతి గింజ కొనుగోలు చేస్తామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. యాసంగిలో జిల్లాకు 4.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం లక్ష్యం కాగా 50శాతం కొనుగోళ్లు పూర్తయినట్లు తెలిపారు. సన్నరకం ధాన్యం బయట రైస్ మిల్లులకు రైతులు విక్రయించడంతో కొనుగోలు కేంద్రాలకు రావడం లేదన్నారు. 2.50 లక్షల టన్నులు మాత్రమే కేంద్రాలకు వచ్చినట్లు చెప్పారు. వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే లారీల ద్వారా రైస్ మిల్లులకు తరలిస్తున్నట్లు వివరించారు. జిల్లావ్యాప్తంగా 410 ధాన్యం కొనుగోలు కేంద్రాలు కొనసాగుతున్నాయని.. ఇందులో 11,000 టార్పాలిన్లు అందుబాటులో ఉంచామన్నారు. మూడేళ్లుగా కొనుగోలు కేంద్రాలకు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన టార్పాలిన్లు ఒక్కటి తిరిగి ఇవ్వలేదన్నారు. అన్ని ఆయా కొనుగోలు కేంద్రాల్లోనే ఉన్నాయని వివరించారు. వీటికి తోడు ప్రస్తుతం వ్యవసాయ మార్కెట్ శాఖ ద్వారా 1000 టార్పాలిన్లు అందుబాటులో ఉంచామని వెల్లడించారు.

50 రైస్ మిల్లులకే ధాన్యం

యాసంగిలో కేవలం 50 రైస్ మిల్లులకే ధాన్యం అప్పగించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఇందులో 35 బాయిల్డ్ రైస్ మిల్లులు, 15 రా రైస్ మిల్లులు ఉన్నాయన్నారు. వర్షాకాలం సీజన్‌లో 111 రైస్ మిల్లులకు ధాన్యం అప్పగించామన్నారు. అయితే రైస్ మిల్లర్లు సకాలంలో బియ్యం తిరిగి ఇవ్వడం లేదన్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని సక్రమంగా పనిచేసే రైస్ మిల్లులను ఎంపిక చేసి వారికి మాత్రమే ధాన్యం అప్పగిస్తున్నట్లు చెప్పారు. గత వానాకాలానికి సంబంధించి మొత్తం 1,80,360 టన్నుల ధాన్యాన్ని రైస్ మిల్లులకు అందజేశామన్నారు. ఇందులో 65,557 టన్నుల ధాన్యానికి సంబంధించి బియ్యం రైస్ మిల్లుల నుంచి ఎఫ్‌సీఐకి వచ్చిందన్నారు. మార్చి, ఏప్రిల్ రెండు నెలల్లోనే 37శాతం ధాన్యం మర ఆడించి ఎఫ్‌సీఐకి బియ్యం తరలించామన్నారు. కాగా మరో 1.14 లక్షల టన్నుల ధాన్యానికి సంబంధించిన బియ్యం రావాల్సి ఉందన్నారు.

సీఎంఆర్ రికవరీ రూ.17.55 కోట్లు

సీఎంఆర్‌కు సంబంధించి రైస్ మిల్లుల నుంచి రికవరీ కొనసాగుతుందని, కొంత మంది మిల్లర్లు స్వచ్ఛందంగా బకాయిలు చెల్లిస్తున్నారని తెలిపారు. 2022-23కు సంబంధించి మొత్తం 2,59,460 టన్నుల ధాన్యం రైస్ మిల్లులకు ఇవ్వాల్సి ఉండగా 2,37,160 టన్నుల ధాన్యం అందజేసినట్లు చెప్పారు. ఇందులో 22 వేల టన్నులు తిరిగి రావాల్సి ఉందన్నారు. ఒక్క శ్రీధర్‌గుప్తా రైస్ మిల్లర్ వద్ద నుంచే 12 వేల టన్నుల ధాన్యానికి సంబంధించి రూ.50 కోట్లు రావాల్సి ఉందన్నారు. అతడి నుంచి ఇప్పటివరకు 17.55 కోట్లు రికవరీ చేశామన్నారు. వీటితో పాటు రూ.12 కోట్ల విలువైన భూములు, రైస్‌మిల్ స్వాధీనం చేసుకున్నామని స్పష్టం చేశారు. మరో 27 మంది రైస్ మిల్లర్ల నుంచి 10 వేల టన్నుల ధాన్యానికి సంబంధించిన డబ్బులు రావాల్సి ఉందన్నారు. ఇందులో 10 మంది రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు, ఆర్‌ఆర్ యాక్ట్ పెట్టినట్లు చెప్పారు. కాగా మరో 17 మంది స్వచ్ఛందంగా బకాయిలు చెల్లిస్తున్నారని తెలిపారు. వీరి నుంచి రూ.3.19 కోట్లు వసూలు చేశామన్నారు. మిగితా బకాయిల వసూళ్ల ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు.

సెలవుగా భావించొద్దు

- ఓటు వేసేందుకు తరలిరండి
- రిటర్నింగ్ అధికారి రాహుల్‌రాజ్ పిలుపు



పోలింగ్ రోజు సెలవు దినంగా భావించకుండా బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్‌రాజ్ పిలుపునిచ్చారు. వేసవి దృష్ట్యా ఓటర్లకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా అధికార యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను శుక్రవారం 'సాక్షి'తో పంచుకున్నారు.

– మెదక్‌జోన్

SAKSHI INTERVIEW సాక్షి

→ ఓటింగ్ శాతం పెంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

కలెక్టర్: వందశాతం ఓటింగ్ లక్ష్యంగా అనేక కార్యక్రమాలు నిర్వహించాం. అసెంబ్లీ ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ జరిగిన పోలింగ్‌స్టేషన్ పరిధిలో అవగాహన కల్పించాం. బైక్ ర్యాలీ, 2కే రన్ నిర్వహించాం. వరుసగా మూడు రోజులు సెలవులు వస్తున్నందున సెలవు దినంగా భావించకుండా బాధ్యతగా ఓటు హక్కు వినియోగించాలి.

→ మెదక్ పార్లమెంట్ బరిలో ఎంత మంది ఉన్నారు? హోం ఓటింగ్ అవకాశం ఎంత మందికి కల్పించారు?

మెదక్ పార్లమెంట్ బరిలో 44 మంది అభ్యర్థులు ఉన్నారు. ఇందులో నలుగురు మాత్రం ఎన్నికల సంఘం గుర్తించిన అభ్యర్థులుండగా, మిగితా వారు స్వతంత్రులు. వీరితో పాటు నోటా కలిపి మొత్తం 45 గుర్తులున్నాయి. 16 మందికి ఒక బ్యాలెట్ యూనిట్ (ఈవీఎం) ఏర్పాటు చేశాం. మూడు బ్యాలెట్ యూనిట్లు అమర్చుతాం. 1,545 మంది హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకోగా 1,409 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

→ మొత్తం పోలింగ్ కేంద్రాలు ఎన్ని? వాటిలో సమస్యాత్మకమైనవి గుర్తించారా?

మెదక్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 2,120 పోలింగ్ కేంద్రాలు ఉండగా 343 సమస్మాత్మకమైనవిగా గుర్తించాం. ఇక్కడ మైక్రో అబ్జర్వర్‌తో పాటు కేంద్ర బలగాలను దింపాం. సీసీ కెమెరాల్లో నిరంతరం పర్యవేక్షిస్తాం.

→ ప్రలోభాల కట్టడికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులతో సమావేశం ఏర్పాటు చేస్తాం. పోలింగ్‌కు ముందు డబ్బులు పంచుతారనే సమాచారం మాకు అందింది. డబ్బులు, మద్యం, వస్తురూపేనా ప్రలోభాలకు గురి చేస్తే సీవిజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలి.

→ ఇప్పటివరకు కోడ్ ఉల్లంఘన కేసులు ఎన్ని నమోదయ్యాయి?

ఎంసీసీ వాయిలెన్స్ కేసులు ఇప్పటివరకు 8 నమోదయ్యాయి. ఇవే కాకుండా వంద వరకు ఎక్సైజ్ కేసులు నమోదయ్యాయి.

→ పార్లమెంట్ పరిధిలో ఓటర్ల సంఖ్య ఎంత? ఓటరు స్లిప్‌ల పంపిణీ ఎంత వరకు వచ్చింది?

మెదక్ పార్లమెంటు పరిధిలో మొత్తం 18,28,210 మంది ఓటర్లు ఉన్నారు. ఇప్పటివరకు 99.28 శాతం ఓటర్లు స్లిప్‌లు పంపిణీ చేశాం.

→ పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి వసతులు కల్పిస్తున్నారు?

ప్రతీ పోలింగ్ కేంద్రంలో ఎండ నుంచి ఉపశమనం కోసం టెంట్లు వేయాలని పంచాయతీ సెక్రటరీలకు ఆదేశాలు ఇచ్చాం. అలాగే తాగునీరు, మరుగుదొడ్ల వసతితో పాటు దివ్యాంగుల కోసం వీల్ చైర్లను ఏర్పాటు చేశాం. ఇందుకు ఒక్కో పోలింగ్ కేంద్రం నిర్వహణకు రూ.4 వేలు, మున్సిపాలిటీలో వార్డు ఆఫీసర్‌కు రూ.4వేలు అందజేశాం. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నాం.

→ దివ్యాంగులు, వయోవృద్ధులు ఓటు వేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారా?

ఈ విషయమై ఏఆర్‌ఓలతో మాట్లాడాం. నడవలేని వారి కోసం ఆటోలను ఏర్పాటు చేయాలని ఆదేశించాం.

→ ఓటు వేసేందుకు ఏ గుర్తింపు కార్డు అవసరం?

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 13 రకాల గుర్తింపు కార్డులను ఉపయోగించవచ్చు. వీటిలో ఏదో ఒకటి వెంట తీసుకెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

క్లుప్తంగా

పటిష్ట బందోబస్తు

సిద్దిపేట సీపీ అనురాధ



మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగంతో కలిసి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. కమిషనరేట్ పరిధిలోని అధికారులు, సిబ్బంది, మహిళా సిబ్బంది, సాయుధ బలగాలు, ట్రెనింగ్ కానిస్టేబుళ్లు, స్పెషల్ ఫోర్స్, ఆర్టీసీ సిబ్బంది, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, కేంద్ర బలగాలతో కలిపి మొత్తం 2,482 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 11 ఉదయం 5 నుంచి ఈ నెల 14వ తేదీ ఉదయం 5 గంటల వరకు 144 సెక్షన్ నిబంధనలు అమలులో ఉంటాయన్నారు. జిల్లాలో 11 చెక్ పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు. 26 మోడల్ కోడ్ కండక్ట్ టీమ్స్, 12 ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్ ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్‌కు 48 గంటల ముందు రాజకీయ ఉద్దేశ్యంతో కూడిన మెసేజ్‌లు పంపకూడదని తెలిపారు.

అయిలన్న గరం గరం చాయ్ ఇయ్యే..

మాజీ మంత్రి హరీశ్‌రావు



అయిలయ్యతో మాట్లాడుతున్న హరీశ్ రావు, వినోద్‌కుమార్

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ కార్నర్ మీటింగ్ ముగించుకొని సిద్దిపేటకు వెళ్లే క్రమంలో మాజీ మంత్రి హరీశ్ రావు పట్టణ శివారులోని రోడ్డు పక్కన అయిలయ్య హోటల్‌లో ఆగి దంపతులతో ముచ్చటించారు. అయిలయ్యతో గరం చాయ్ చేయించుకొని తాగి కారు గుర్తుకు ఓటు వేసి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. వీరి వెంట ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ ఉన్నారు.

జహంగీర్‌ను గెలిపించండి

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య



ప్రచారం చేస్తున్న నాయకులు

కొముురవెల్లి(సిద్దిపేట): ప్రజా పోరాటాల సారథి భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య అన్నారు. శుక్రవారం మండల కమిటీతో కలిసి మండలంలోని రసులాబాద్, అయినాపూర్, తపాస్‌పల్లి, గౌరయపల్లి గ్రామాల్లో సీపీఎం అభ్యర్థి జహంగీర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీల అసమర్థత వల్లే గ్రామాలు వెనుకబడి ఉన్నాయని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడూ అభివృద్ధి చేయని నాయకులు మళ్లీ గెలిస్తే అభివృద్ధి ఎలా చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, తాడూరి రవీందర్, అత్తిని శారద, నర్సవ్వ, ఎల్లయ్య, కంకణాల చంద్రం, కనకయ్య, కిష్టయ్య, తదితరలు పాల్గొన్నారు.

దేశాభివృద్ధి కోసం బీజేపీకి ఓటేయాలి

ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్ గౌడ్

నర్సాపూర్ రూరల్: దేశాభివృద్ధి కోసం బీజేపీకి ఓటేయాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాప గారి రమేశ్ గౌడ్ ఓటర్లను కోరారు. శుక్రవారం మండలంలోని నత్నయ్యపల్లి , కొండాపూర్ గ్రామాల్లో బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. రైతులతోపాటు పేద బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. నరేంద్ర మోదీ పాలనతో భారత దేశ ఖ్యాతి ప్రపంచ స్థాయికి వెళ్లిందన్నారు.

మాటల తూటాలు..

అభివృద్ధిపై చర్చ ఏదీ?

- విచిత్రంగా లోక్ సభ ఎన్నికల ప్రచారం
- గెలిస్తే ఏం చేస్తామో చెప్పని నేతలు
- గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేదంటూ విమర్శలు
- ఒకరిపై ఒకరు బురద జల్లుకుంటున్న వైనం
- నాయకుల మాటలకు విస్తుపోతున్న ప్రజలు



మెదక్‌జోన్: రాజకీయ నాయకుల మాటలంటేనే నీటి మీద రాతలనే విధంగా మారింది లోక్ సభ ఎన్నికల ప్రచారం. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఎంపీగా గెలిపిస్తే కేంద్రం నుంచి నిధులు తెచ్చి పార్లమెంట్ పరిధిలో ఫలానా అభివృద్ధి చేస్తామంటూ ఏ పార్టీ నేత చెప్పడం లేదు. ఎంత సేపూ మీ పార్టీ గతంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయటంలేదంటూ ఒకరిపై ఒకరు బురద జల్లుకుంటున్నారు. దీంతో నేతల మాటలు వింటున్న ప్రజలు విస్తుపోతున్నారు.

కాంగ్రెస్ ఘాటు వ్యాఖ్యలు..

కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా ఆ పార్టీ ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, పొంగులేని శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ప్రచారం చేస్తూ బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో పేదలకు ఒక్క డబుల్ బెడ్రూం కట్టించలేదని, వారి హయాంలో అంతా అవినీతి మయమేనన్నారు. కేసీఆర్, హరీశ్‌రావులకు జైలు తప్పదని, జైల్లో ఉన్న కవితను విడిపించుకోవటానికి కేసీఆర్ ప్రధాని మోదీతో కుమ్మక్కైయ్యారని ఘాటుగా విమర్శించారు. మెదక్ జిల్లాకు పరిశ్రమలు ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో నే వచ్చాయి తప్ప కేసీఆర్ ప్రభుత్వం ఏంచేయలేదంటూ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం మార్చి బీసీ, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు మార్చుతారంటూ ఘాటైన విమర్శలకు ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీ విమర్శించారు.

అభివృద్ధి పనుల్లో కొన్ని..

తమను ఎంపీగా గెలిపిస్తే మెదక్‌తో పాటు పార్లమెంట్ పరిధిలో గల సమస్యలను తీరుస్తామని ఏ నాయకుడు చెప్పడంలేదు. మెదక్ పట్టణానికి అత్యవసరంగా రింగ్‌రోడ్డును నిర్మించాలి. కొన్ని రోజులుగా మూడు ప్రధాన పార్టీలు చేస్తున్న రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లతో గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అయ్యి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రం నుంచి నిధులు తెచ్చి నవోదయ పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాలు, రైల్వే ట్రాక్‌ల నిర్మాణాలు చేపట్టాలి. తమను గెలిపిస్తే ఇలాంటి అభివృద్ధి పనులు చేస్తామని ఏ ఒక్క నాయకుడు చెప్పడం లేదు.

కేసీఆర్, హరీశ్‌రావు విమర్శలు..

బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా మాజీ సీఎం కేసీఆర్‌తోపాటు మాజీ మంత్రి హరీశ్‌రావు ఎన్నికల ప్రచారాన్ని చేస్తున్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలంటూ ఒక్క ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, అవి నెరవేర్చకుండా ఓట్లు ఎలా అడుగుతారంటూ, కాంగ్రెస్ నేతలను గుక్క తిప్పుకోకుండా విమర్శిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్లుగా ఆగస్టు 15 వరకు రూ.2 లక్షల రుణమాఫీతో పాటు ఆరుగ్యారంటీలను అమలు చేస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, మాజీ మంత్రి హరీశ్‌రావు మెదక్ నుంచి సవాల్ విసిరారు. లేకుంటే సీఎం తన పదవికి రాజీనామా చేయాలంటూ ఏకంగా తన రాజీనామా పత్రాన్ని హైదరాబాద్‌లోని అమరవీరుల స్థూపం వద్దకు తీసుకెళ్లారు. ఇది రాష్ట్రంలోనే సంచలం సృష్టించింది. కేసీఆర్ మాట్లాడుతూ అబద్ధాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ప్రజలు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారన్నారు. దుబ్బాకలో చెల్లని రూపాయి మెదక్‌లో ఎలా చెల్లుతుందని బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు నుద్దేశించి కేసీఆర్ ఘాటు విమర్శలు చేశారు.

మోదీ, అమిత్‌షా రంగంలోకి..

బీజేపీ అభ్యర్థి రఘునందర్‌రావుకు మద్దతుగా ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షా, గోవా సీఎం ప్రమోద్ సావంత్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు ప్రచారం చేస్తూ రాష్ట్రంలో బీఆర్ఎస్ చేసింది శూన్యమని, 10 ఏళ్లలో రాష్ట్రాన్ని దోపిడీ చేశారని, కాళేశ్వరంలో వేల కోట్లు దోచుకొని మూడేళ్లకే మూలన పడే ప్రాజెక్టు నిర్మించారని విమర్శించారు. ఈ కేసులో అవినీతికి పాల్పడిన వారెవరిని ప్రభుత్వం వదలదని హెచ్చరించారు. కాంగ్రెస్‌ది కుటుంబపాలన అని, బీజేపీది భారతీయ కుటుంబమని, అమిత్‌షా, మోదీలు విమర్శించారు. ఢిల్లీ కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంలా మారిందంటూ విమర్శలను బీజేపీ నేతలు చేశారు. కాంగ్రెస్ తమపై బురదజల్లే ప్రయత్నం చేస్తూ రాజ్యాంగం మారుస్తారని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, రాజ్యాంగాన్ని మార్చడం ఎవరి తరం కాదన్నారు. ఇప్పటి వరకు కాంగ్రెస్సే రాజ్యాంగాన్ని అత్యధికంగా మార్చిందన్నారు.

వైఎస్సార్ శిష్యుడిని.. మాట తప్పను

- రెండేళ్లలో నియోజకవర్గ రూపురేఖలు మారుస్తా
- మంత్రి దామోదర రాజనర్సింహ



మాట్లాడుతున్న మంత్రి దామోదర

జోగిపేట(అందోల్): దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శిష్యుడినైన తాను మాట తప్పేదిలేదు.. మడమ తిప్పేది లేదని మంత్రి సి.దామోదర రాజనర్సింహ అన్నారు. శుక్రవారం జోగిపేటలో నిర్వహించిన కాంగ్రెస్ భారీ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం క్లాక్‌టవర్ వద్ద ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. నియోజకవర్గంలోని 40వేల ఎకరాలకు సింగూరు జలాలను సేద్యానికి అందించించేందుకు నిధులు మంజూరు చేసింది వైఎస్సార్ అని, కాలువలు పూర్తి చేసింది తానేనని గుర్తు చేశారు. నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తానని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో నాలుగైదు పరిశ్రమలను ఏర్పాటు చేసి తీరుతానని అన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా బాధ్యతలను చేపట్టిన వంద రోజుల్లోనే రూ.500 కోట్ల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించానన్నారు. జోగిపేట-అజ్జమర్రి వంతెన నిర్మాణానికి రూ.80 కోట్లు మంజూరు చేయించి శంకుస్థాపన కూడా చేసినట్లు తెలిపారు. మరో రెండేళ్లలో జోగిపేట రూపు రేఖలు మారుస్తానని ఇచ్చారు. ఆగస్టు 15 వరకు రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతామన్నారు. అందోలు, జోగిపేట పరిధిలో ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. సురేష్ షెట్కార్ మాట్లాడుతూ పదేళ్లలో నియోజకవర్గానికి బీబీ పాటిల్ చేసిందేమీలేదన్నారు. రూ.16 కోట్ల ఎంపీ నిధులను వినియోగించకుండా బుట్టదాఖలు చేశారన్నారు. మున్సిపల్ చైర్మన్ జి.మల్లయ్య, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఎస్.జగన్మోహన్‌రెడ్డి, చిట్టిబాబు, సురేందర్‌గౌడ్, శివశంకర్, సురేష్, నాగరాజు, చందర్, దుర్గేష్, రేఖ, సత్యం పాల్గొన్నారు.

బసవేశ్వరుడి సేవలు చిరస్మరణీయం

బాల్య వివాహాలు, సతీ సహగమనం వంటి సాంఘిక దురాచారాలను వ్యతిరేకించిన మహనీయుడు బసవేశ్వరుడు అని మంత్రి దామోదర రాజనర్సింహ కొనియాడారు. శుక్రవారం పట్టణంలో లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన బసవేశ్వరుడి జయంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమానికి రమేశప్ప, సత్యవ్రత్, పి.రవీందర్, రాజేందర్, జి.మల్లయ్య, ప్రవీణ్‌కుమార్, రంగ సురేష్, డి.శివశంకర్, ఎస్.సురేందర్‌గౌడ్, దుర్గేష్, కె.నాగరాజు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నీలంను భారీ మెజార్టీతో గెలిపించాలి

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



మాట్లాడుతున్న మైనంపల్లి రోహిత్

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని మెదక్‌లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ కోరారు. శుక్రవారం రాత్రి చిన్నశంకరంపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. మాయమాటలు చెప్పేటోళ్లం కాదు చేసేది.. చెప్తాం చేసి చూపిస్తామన్నారు. మూడు నెలల్లోనే ఐదు గ్యారంటీలు అమలు చేశామని, మెదక్ నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిచేందుకు కమిటీ వేసి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్ల ప్రజలను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాన సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు రాజిరెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్రీమన్‌రెడ్డి, నరేందర్, అరుణ, గణేశ్, సురేందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా ఎన్నికల నిర్వహణ



నారాయణఖేడ్: స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్

ఎస్పీ చెన్నూరి రూపేశ్

నారాయణఖేడ్: లోక్‌సభ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించడానికి కృషి చేస్తున్నట్లు ఎస్పీ చెన్నూరి రూపేశ్ తెలిపారు. ఖేడ్‌లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆర్డీఓ అశోక చక్రవర్తి, డీఎస్పీ వెంకట్‌రెడ్డిలతో కలిసి ఎన్నికల నిర్వహణ తీరు, రూట్లు, తదితర విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వచ్చిన అదనపు బలగాలకు ఎస్పీ సూచనలు చేశారు. అనంతరం నాగల్‌గిద్ద మండలం మోర్గిలోని చెక్‌పోస్టును ఎస్పీ తనిఖీ చేశారు.

చెక్ పోస్టుల తనిఖీ

జహీరాబాద్: కర్ణాటక సరిహద్దులో ఉన్న హుసెల్లి, మోర్గి చెక్‌పోస్టులను ఎస్పీ రూపేశ్ సందర్శించారు. వాహనాల తనిఖీ తీరును పరిశీలించారు.

అమలుకాని ఆరు గ్యారంటీలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీల అమలును మర్చిపోయిందని దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి అన్నారు. చేగుంటలో శుక్రవారం సాయంత్రం బీఆర్ఎస్ మెదక్ ఎంపీ వెంకట్రామ్‌రెడ్డి తరఫున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. అమలుకాని ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. గతంలో ఎంపీ అభ్యర్థిగా ఓడిపోయిన బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు ప్రస్తుతం గెలిచే పరిస్థితి లేదన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డిని గెలిపిస్తే సొంత డబ్బులతో యువతకు ఉపాధి కల్పిస్తారని పేర్కొన్నారు. ఎంపీ అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ.. తనకు ఎంపీగా అవకాశం కల్పిస్తే వంద కోట్లతో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు నారాయణరెడ్డి, జిల్లా నాయకులు రాజిరెడ్డి, జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మంచికట్ల శ్రీనివాస్, యూత్ నాయకులు రాజుతోపాటు పలు గ్రామాల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రీలాంచ్ పేరుతో రూ.15 కోట్లు మోసం

ఓబిలి హౌసింగ్ యజమాని అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో మరో ప్రీలాంచ్ మోసం వెలుగులోకి వచ్చింది. తమ వెంచర్‌లో డిపాజిట్ చేస్తే అధిక లాభాలు వస్తాయంటూ నమ్మించి రూ.15 కోట్లు కుచ్చుటోపీ పెట్టిన ఓబిలి హౌసింగ్ యజమాని ఓబిలి పాపన్నగారి రామచంద్రారెడ్డిని శుక్రవారం సైబరాబాద్ ఎకనామిక్ అఫెన్స్ వింగ్ (ఈఓడబ్ల్యూ) పోలీసులు అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ ఎల్ సమరాం రెడ్డి శ్రీను కథనం మేరకు.. చిత్తూరు జిల్లా రేణిగుంటకు చెందిన రామచంద్రారెడ్డి, ప్రతిష్టా ప్రాపర్టీస్ ఎండీ వీబీ గుప్తా, ఇతర మార్కెటింగ్ ఏజెంట్లు ముఠాగా ఏర్పడి.. సదాశివపేటలోని వెంకటాపురం గ్రామంలో హైవే ప్యారడైజ్ పేరుతో వెంచర్‌ను ప్రారంభించారు. 200 ఎకరాల్లో ఓపెన్ ప్లాట్లను అభివృద్ధి చేస్తున్నామని, అనధికారిక లే అవుట్‌తో అందమైన బ్రోచర్లు, కరపత్రాలను ముద్రించారు. ప్రాజెక్ట్‌కు చేరువలోనే ఐఐటీ కంది, ఐటీ పార్క్, రీజినల్ రింగ్ రోడ్డు వస్తున్నాయంటూ అమాయకులను ఆకర్షించారు. మూడేళ్ల వ్యవధితో తమ ప్రాజెక్ట్‌లో డిపాజిట్ చేయాలని, నెలవారీ వడ్డీ చెల్లిస్తామని నమ్మించారు. నిర్ణీత వ్యవధిలో ప్లాట్‌ను రిజిస్టర్ చేయకపోతే గజానికి రూ.వెయ్యి చొప్పున అదనంగా చెల్లించి ప్లాట్‌ను తిరిగి కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. దాదాపు 50 మంది బాధితుల నుంచి రూ.15 కోట్లు వసూలు చేశారు. ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయకుండా, కట్టిన డబ్బులు వెనక్కి ఇవ్వక పోవడంతో బాధితులు సైబరాబాద్ ఈఓడబ్ల్యూలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడు రామచంద్రారెడ్డిని అరెస్టు చేశారు. మిగిలిన నిందితులు పరారీలో ఉన్నారు.

పొలిటికల్ హీట్

పదేళ్లలో కానరాని ప్రగతి

- అమలుకు నోచుకోని బీజేపీ, బీఆర్ఎస్ హామీలు
- ఆగస్టు 15న రైతులకు రుణమాఫీ
- హరీశ్ రావు రాజీనామా సిద్ధం చేసుకోవాలి
- మంత్రి కొండా సురేఖ



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, పక్కన ఎంపీ అభ్యర్థి నీలం మధు

సిద్దిపేటరూరల్: పదేళ్ల కాలంలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ పార్టీలు ప్రజలకు ఇచ్చిన హామీలను ఎంతవరకు అమలు చేసి అభివృద్ధి చేశారో చూపించాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం రూరల్ మండల పరిధిలోని పుల్లూరు, నారాయణరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. కొండా సురేఖ హాజరై మాట్లాడుతూ.. నీలం మధు వార్డు మెంబర్ స్థాయి నుంచి అందరి మన్ననలు పొందుతూ, సేవా కార్యక్రమాలు చేస్తూ ఈ స్థాయికి వచ్చారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆగస్టు 15 లోపు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీని అమలు చేయనున్నారని, సవాల్ విసిరిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు రాజీనామా లేఖను సిద్ధం చేసుకోవాలన్నారు. పదేళ్ల పాలనలో ప్రగతి ఏం కనిపించలేదన్నారు. చింతమడక గ్రామానికి చిల్లు పడిందని రాబోయే రోజుల్లో గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామన్నారు. నీలం మధు ముదిరాజ్ ను భారీ మెజార్టీ తో గెలిపించాలన్నారు. అంతకుముందు నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ.. నిరుపేద పేదింటి బిడ్డ అయిన నాకు కాంగ్రెస్ అవకాశం కల్పించిందన్నారు. తనకు ఓటు వేస్తే కేంద్రం నుంచి, రాష్ట్రం నుంచి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం చింతమడక గ్రామం మాజీ సర్పంచ్ సత్యనారాయణ గౌడ్, నారాయణరావుపేట మాజీ సర్పంచ్ రంగా గౌడ్ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా కండువా కప్పుకొని పార్టీలో చేరారు. కార్యక్రమంలో సిద్దిపేట నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, మండల అధ్యక్షులు రాములు, బర్మా రామచంద్రం, కనకయ్య, కర్ణాకర్, బాబేశ్, రాజ్ వీర్, అత్తు ఇమామ్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మతాల మధ్య బీజేపీ చిచ్చు

- హామీల అమలులో కాంగ్రెస్ విఫలం
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



ప్రచారంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): మతాల మధ్య బీజేపీ చిచ్చు పెడుతుందని, కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం హత్నూర మండలం దౌల్తాబాద్, నస్తీపూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్ రెడ్డితో కలిసి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ నాయకులు 100 రోజుల్లో అమలు చేస్తామన్న ఆరు గ్యారెంటీలు ఇప్పటికీ అతీగతి లేదన్నారు. అమలు కానీ హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అన్నారు. మతాల మధ్య కులాల మధ్య చిచ్చు పెడుతూ బీజేపీ ప్రభుత్వం పదేళ్లు గడిపినా దేశం మాత్రం అభివృద్ధి సాధించ లేదన్నారు. కులం పేరుతో మతం పేరుతో ప్రజలను మోసం చేయాలని చూస్తే ఈ ఎన్నికల్లో ప్రజలే కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింలు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్, పీఏసీ చైర్మన్ దామోదర్ రెడ్డి, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు శివ శంకరరావు, యువత మండల శాఖ అధ్యక్షుడు కిషోర్, నాయకులు శ్రీకాంత్, అజ్మత్ అలీ, అర్జున్, మధు, స్వామి, పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవకు వచ్చా ఆశీర్వదించండి

బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి



మాట్లాడుతున్న వెంకట్రామిరెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): కలెక్టర్‌గా మీ కోసం పని చేసిన.. ప్రజాసేవకై వచ్చా ఆశీర్వదించండి మీ కోసం రూ.100 కోట్లతో ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవలందిస్తానని బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి కోరారు. శుక్రవారం నార్సింగి మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్నర్ మీటింగ్‌లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యావంతుడిగా ఉన్నతమైన కలెక్టర్ ఉద్యోగం వదిలేసి పూర్తిగా ప్రజా సేవ చేసేందుకే ముందుకు వచ్చానన్నారు. ప్రజలు ఆలోచించి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

రఘునందన్ ముంచేటోడు : ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

మోదీ మంచోడే అయినా.. బీజేపీ అభ్యర్థి రఘునందన్ ముంచేటోడని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. దుబ్బాక ఎమ్మెల్యేగా గెలిచి మూడేళ్ల ప్రజలకు చేసిందేమిలేదన్నారు. ఎక్కడ రోడ్డు పక్కన ప్లాట్ కనిపిస్తే కేసులు వేస్తూ బ్లాక్ మెయిల్ చేస్తూ మూడేళ్ల కాలం వెల్లదీశాడన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాణపురం కృష్ణారెడ్డి, ఎంపీపీ సబితా, వైస్ ఎంపీపీ సుజాత, ఎంపీటీసీ సుజాత మల్లేశం గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుమ్మరి బాబు, పట్టణ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకం



మాట్లాడుతున్న గాలి అనిల్ కుమార్

బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్

ఝరాసంగం(జహీరాబాద్): బీఆర్ఎస్‌తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ అన్నారు. శుక్రవారం ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్‌తో కలిసి మండల కేంద్రమైన ఝరాసంగం ప్రధాన చౌరస్తాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదేళ్ల కాలంలో దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించామన్నారు. బీబీ పాటిల్ కేతకి సంగమేశ్వర ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని దత్తత తీసుకొని, ఎలాంటి అభివృద్ధి చేయలేదని డీసీఎంఎస్ చైర్మన్ విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు దేవిశ్రీ ప్రసాద్, షేక్ ఫరీద్, కిజార్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశం, వివిధ గ్రామాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయండి

పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు డాక్టర్ రామేశ్వర్ సింగ్



పాపన్నపేట(మెదక్): కొత్తపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రామేశ్వర్‌సింగ్

పాపన్నపేట(మెదక్): ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు, భయభ్రాంతులకు లోనుకాకుండా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు డాక్టర్ రామేశ్వర్‌సింగ్ సూచించారు. శుక్రవారం ఆయన పాపన్నపేట ఎస్సై నరేశ్‌తో కలిసి మండల పరిధిలోని కొత్తపల్లి, యూసుఫ్‌పేట, పాపన్నపేట ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మండలంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గురించి ఎస్ఐని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు చర్యలు చేపట్టాల్సిందిగా ఎస్సైకి సూచించారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

తూప్రాన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం మెదక్ జిల్లా పోలీస్ అబ్జర్వర్ డాక్టర్ రామేశ్వర్ సింగ్, డీజీ ఐపీఎస్ మండలంలోని పోలింగ్ స్టేషన్లను, చెక్ పోస్టులను సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికలను ప్రభావితం చేసే ఎలాంటి అనుమానాస్పద అంశం తమ దృష్టికొచ్చినా క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. గత ఎన్నికల్లో మాదిరిగానే ఈసారి ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగే విధంగా ప్రజలు నిర్భయంగా వచ్చి తమ ఓటును వినియోగించుకునే విధంగా కృషి చేయాలని సిబ్బందికి తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ కృష్ణ, ఎస్ఐ శివానందం తదితరులు ఉన్నారు.